# మిడిల్ క్లాస్ మెంటాలిటీ

"అమ్మా" అని పిలిచేడుట మా చిన్ని.

ఏంవింటో! నాకీమధ్య తెగ పరధ్యానం వచ్చేస్తోంది.

"వచ్చేస్తోందేంవింటి! నీ మొహం. బి ప్రిసైజ్. మొదటి నుండీ ఉంది. ఇప్పుడు ఎక్కువైంది. అంతే" మావారి వ్యాఖ్య.

ఏ మాట కామాటే చెప్పుకోవాలి. మా వారు నాకంటే పదేళ్లు పెద్ద. అయినా ఆయనకి పరధ్యానం రాలేదు. రావలసినదంతా పుట్టినప్పుడే వచ్చేసింది.

"అబ్బబ్బ! ఎన్నిసార్లు పిలవాలమ్మా. నీ పరధ్యానం కాదు కాని చంపేస్తున్నావు" చిన్ని గావు కేక.

వాడ్ని కాస్ట్ అకౌంట్స్ చదివించడం మా బుద్ధి తక్కువ. ప్రతి మాటకి కాస్ట్ కట్టాలంటాడు.

అనడానికేం?

ఎన్నైనా అనొచ్చు.

నిద్రలో నడుస్తున్న దానిలా డ్రాయింగ్ రూంలోకి వెళ్లేను.

"ఆ కూర కలపమని నీ కోడలితో చెప్పి నువ్విలా కూర్చో" అన్నాడు.

ఆ మాట వాడే చెప్పొచ్చు కాని చెప్పడు.

ఒకవేళ చెప్పినా "చెయ్యి ఖాళీ లేదండీ" అని సాగదీస్తుంది.

కాకి కథలోలాగా పాపం! ఆ పిల్లకి ఎప్పుడూ చెయ్యి ఖాళీ ఉండదు. మరింక నేనే వెళ్లి స్టౌ ఆర్పేసి వచ్చి కూర్చున్నాను.

మావారు ఊళ్లోలేరు. తన ఫ్రెండు ఎవరికో డైవోర్సు వచ్చిందిట సెలబ్రేషన్‌కి వెళ్లారు.

"ఇంత అసందర్భపు మనిషిని నేనెక్కడా చూళ్లేదు. ఇదేమైనా

శుభకార్యమా సెలబ్రేషన్‌కి? బుద్ధుందా?" తిట్టేను.

మానవుడు చలించలేదు. పైగా "కొన్ని డైవోర్సులు పెళ్లి కంటే శుభప్రదమైనవి. చూడు సుందరమ్మడూ. నీది పిచ్చిక బ్రైను. నీకు అర్థం కాదులే" అని ఒక సీరియల్ నవ్వొకటి విసిరి వెళ్లిపోయేరు.

ఆ తండ్రికి కొడుక్కాడూ వాడు!

మా వారు లేకపోవడం వల్ల మేస్టరు లేని వీధిబడిలా ఉంది మా ఇల్లు.

'నాన్న చేసినవి చిన్న ఉద్యోగాలు కావు కదా?' అన్నాడు. ఉపోద్ఘాతంగా.

ఇదేం ప్రశ్న. ఇది అడగడానికా పనివేళాపిల్చాడు!

"పైగా రిటైరైనా చేస్తూనే ఉన్నారు కదా" అన్నాడు వాడే మళ్లీ.

నేను బోనులో ముద్దాయిలాగా, వాడేదో ప్రాసిక్యూటర్లాగా ఈ క్రాస్ ఎగ్జామినేషనేవిటి?

వీటిని లీడింగ్ కొశ్చన్స్ అంటారు.

జడ్జీ కూతుర్ని.

జడ్జీ పెళ్లాన్ని.

ఆ మాత్రం తెలీదా!

వాటికి జవాబు చెప్పనవసరం లేదు.

కేవలం తలాడిస్తే చాలు.

ఆడించేననే గుర్తు.

కోర్టులో అయితే తలాడిస్తే ఊరుకోరు.

మామూలుగా అయితే వాడిలాటి పనికిమాలిన ప్రశ్నలు అడిగినందుకు దులిపేసేదాన్ని కాని అర్జంటుగా ఇల్లు ఖాళీ చెయ్యాలన్న బెంగా–మంచి ఇల్లు దొరకదేమోనన్న భయం – నాకు డబుల్ టైఫాయిడ్‌లా పనిచేసి నోటమాట రావటంలేదు.

నేనూ ఊరుకున్నకొద్దీ వాడు రెచ్చిపోతున్నాడు. "తాతలనాటి ఇల్లు అమ్మేశారు" అన్నాడు.

నాకు నవ్వొచ్చింది.

"ఇల్లు ఒక్కటేనా? ఇంట్లో ఉన్న వెండి, బంగారం అంతా అమ్మేశాం. ఔన్రా బాబు. ఏంచీ అమ్మకపోతే ఈ జానా బెత్తెడు

జీతంతో మీ చదువులు డిగ్రీలు దాటేవి కాదు. మీరు మీ నాన్న కోర్టులోనే ఏ టైపిస్టుగానో, కాపీయిస్టుగానో ఉండేవారు. మీ అక్కలు డాక్టర్లు అయ్యేవారు కాదు. సంసారాల్లో స్థిరపడిపోయేవారు. ఇల్లు, ఒళ్లు గుల్ల అయితేనే కదా మీరింత వాళ్లై నన్ను ఇలా నిలేస్తున్నారు" అందామనుకున్నాను. కాని సమయం కాదు.

ఏంవింటి వీడి బేహద్బీ!

మా వారు ఊర్లో లేకపోతేనే వీడిలా తోక జాడిస్తున్నాడు.

ఒకవేళ పూర్తి...!

భగవాన్! నాకా శిక్ష వెయ్యకు.

"నాన్నకి ఎన్ని హార్ట్ ఎటాక్‌లు వచ్చాయి?" వాడి క్రాస్ ఎగ్జామినేషన్ అవలేదు.

"ఏమో! ఎవరులెక్కపెట్టేరు?" విసుక్కున్నాను.

"అంటే లెక్కపెట్టలేనన్ని వచ్చేయన్నమాట"

నాకు విసుగొచ్చేస్తుంది.

"ఏంవింట్రా నీ గోల?"

"నాది గోలగానే ఉంటుంది. ఆ రోజుల్లో ఇల్లు కట్టుకోవడానికి అందరికీ అప్పాలిచ్చేరు. నాన్న తప్ప అందరూ కట్టుకున్నారు. అప్పాడు ఓ ఇల్లు కట్టి పడేస్తే ఇప్పాడీ బాధలుండేవి కావు. ఆయనకసలు ...." ఇంకా ఏం అనేవాడో కాని మా పెద్దవాడు అటు రావడం చూసి ఆగేడు.

"ఔను. కట్టి పడేస్తే మీ సంగతెలా ఉన్నా మాకు హాయిగానే ఉండేది. రేపు నీ ఇంటా నీ ఇంటా దేవులాడాల్సిన అవసరం ఉండేది కాదు. కాకపోతే మీరంతా ఇలా ఉండేవారు కాదు. అయినా మేము ఒట్టి చవటలంరా అబ్బీ. ఈ వేళ గడుస్తే చాలనే అనుకున్నాం గాని రేపెలాగా అని ఆలోచించలేదు. నాలుగు దిక్కుల్లాగా నాలుగు పిల్లలున్నారు కదా. ఒక్కరైనా దిక్కవరా అనుకున్నాం. మీరు కట్టండిరా బ్రహ్మాండమైన బంగళాలు. మా పిల్లలు ప్రయోజకులయ్యేరని సంతోషిస్తాం" అని గేదెని కడిగినట్టు కడిగేద్దామనుకున్నాను కాని ఇంతలో "అమ్మా! వాడితో ఏవిటి? వెళ్లి పని చూసుకో. ఒరే! నీకేమైనా అడగాల్నుంటే నాన్ననే

అడుగు. ఆవిడ్ని అంటావేం?" అని మా పెద్దవాడు అనగానే!

"ఆయన్ని అడగలేకే..." అని గొణుక్కుంటూ వెళ్లిపోయేడు.

ఇంతకీ అసలు సంగతి...

మొన్న మా ఇంటిగలాయన వచ్చాడు. పరమ నంగిరి పింగిరి వాడు. అద్దె కోసం ఇంత దూరం ఎందుకు వస్తావయ్యా అంటే వినడు.

నెలకోసారి ఇల్లు చూసుకోవాలిట.

ఇల్లు ఎక్కడికైనా పారిపోతుందా?

చాదస్తం! వచ్చినపుడల్లా ఇల్లంతా కలియతిరుగుతాడు. తరువాత ఓ రెండు గంటలు తన ఆఫీసు గొడవలూ, వాళ్లావిడ గొడవలూ ఏకరువు పెడ్తాడు.

చిక్కేవిటంటే అతను మళయాళీ.

అంచేత తెలుగు సరిగ్గా రాదు.

ఇంగ్లీషూ మళయాళం లాగే మాట్లాడతాడు.

ఆ ఇంగ్లీషు వింటే జుత్తు పీక్కోని, పక్కవాళ్లని బక్కిరేస్తాం.

"మై స్కూటర్ ఈజ్ డూయింగ్ వెల్"

"మీకు పాలకేం బెంగలేదు. పక్కనే కౌబాయ్ ఉన్నాడు"

"మా రోజ్ మొక్కలు ప్రెగ్నంట్"

"జామకాయలు మరీ చిన్న పిల్లలు"

ఇవి అతని ఇంగ్లీషుకి మచ్చుతునకలు.

మా వారికి ఇంగ్లీషంటే విపరీతమైన అభిమానం. అంచేత మామూలుగా రుమాలు కూడా ఉతుక్కోని మనిషి ఇంటిగలాయన రాగానే బాత్రూంలో దూరి లాండ్రీ పెట్టేస్తారు.

మొన్న అతను వచ్చినప్పుడు తను ఎన్ని కష్టాలు పడి ఇల్లు కట్టేడో ఒక గంట చెప్పేడు. (అతను రాగానే మా వాళ్లంతా వార్ టైంలో సైరను వినిపించగానే ఎక్కడి వాళ్లక్కడ పారిపోయినట్టు పారిపోతారు. నాకు తప్పదు) తను తెచ్చిన సంబంధాలు తన కూతురు ఎలా తిరగ్గొట్టిందో మరో గంట చెప్పేడు. మూడు రోజుల క్రితం అనుకోకుండా అమెరికా సంబంధం ఎంత అద్భుతంగా కుదిరిందో చెప్పేడు. అల్లుడు వెంటనే అమెరికా వెళ్లిపోవాలిట. స్వంత ఇంట్లో పెళ్లి చెయ్యాలని అతనిదీ

వాళ్లావిడదీ జమిలి కోరికట.

ఇంత వరకూ అద్భుతంగానే ఉంది.

"సో యుసీ యు ఎఫ్టీ ది హౌస్" అన్నమాటే అద్భుతంగా లేదు.

అతను వెళ్లే సరికి రాత్రి తొమ్మిదైంది.

పిల్లలు ఏడిచేస్తున్నారు ఆకలికి.

కుక్క అరిచేస్తోంది. దానికి ఆకలే.

కొడుకులు శోష వచ్చి పడిపోయేరు.

ఇంకా నేను వంట మొదలు పెట్టలేదు.

"ఇది ఇవేళ రాత్రా? నిన్నటి రాత్రా?" రేపు నుండి వస్తున్న చాకలిలా బాత్రూంలోకి వస్తూ అడిగేరు మా వారు.

అదీ సంగతి.

మరింకేం ఉంది? ఇళ్లవేట?

ఇంతకంటే పులివేట నయం. అటో ఇటో అర నిముషంలో తేలిపోతుంది.

"అమ్మడూ ఫ్లాట్స్ మాత్రం వద్దు. ఆకాశం కనిపించదు. మనకిపైన, కింద, పక్కన ఎటు చూసినా మనుషులే. గుట్టు, మరుగు ఉండవు. నాలుగు రోడ్ల మధ్య సంసారం చేస్తున్నట్టుంటుంది. బంగళాల్లో బతికిన వాడ్ని ఫ్లాట్ నా వల్ల కాదు రా. పోనీ ఎక్కడైనా స్థలం చూడు. తల తాకట్టు పెట్టి కొనేసి పాక వేసుకుని ఉందాం" అని మా వారి బాధ.

నిజమేఁ కాని ఈ రోజుల్లో ఇండిపెండెంటు ఇల్లు ఎక్కడ దొరుకుతుంది? దొరికినా దాని అద్దెకి మా జీతం సరిపోతుంది.

బాధపడ్డారే కాని అతనికి మాత్రం తెలీదా?

"నాన్నకి వేరే గది, వేరే బాత్రూం ఉండాల్సిందే. నా పెన్ను ఎవరో తీశారు. నా కాయితాలు కెలికేశారు. అని ఆయన తగువులు మా వల్ల కాదు. మూడు బెడ్రూంలు దొరికితేనే వెళ్తాం" అన్నారు కొడుకులు.

'అంటే నేను పరమ పేచీ కోరుగాడ్ని అంటారు. ముసలాళ్లం. మనకి వేరే గది ఎందుకే? పేవ్మెంటు మీద ముష్టివాళ్లలాగా, ప్లాట్ఫారం మీద అడుక్కునే వాళ్లలాగా మనం డ్రాయింగ్ రూంలోనే ఉందాం'

అన్నారు మా  వారు ఉడుక్కొని.

"పెడర్థాలు తియ్యకండి. అసలే తోచక ఛస్తున్నాం" అని కసిరాను.

వేట ప్రారంభించేం.

పాల వాడికి, కూరల వాడికి, పేపరు వాడికి అందరికీ చెప్పాం. కొన్ని ఫ్లాట్స్ చూస్తే మతిపోతుంది.

ఆ ప్లాన్ వేసిన వాడికి నోబెల్ ప్రైజు ఇవ్వాలి. ఏ మెట్లు ఎక్కితే ఎక్కడికి వెళ్తామో తెలీదు. భూమ్మీద చినుకు పడితే  పార్కింగులో ఈత కొట్టాల్సిందే. కొన్ని ఫ్లాట్స్‌లో మెట్లు నేను అడ్డంగా ఎక్కాలి. లేకపోతే బిరడా పట్టినట్టు  ఉండిపోతాను.

ఇంక గదులు – మా చిన్నప్పుడు వరండాకి అటూ, ఇటూ చిన్న కొట్టు కట్టేవారు. దేవుడి కొట్టు, ఆవకాయ  కొట్టు, ముట్ల కొట్టు వగైరాలు. వాటినే ఇప్పుడు గదులంటున్నారు. గదిని హాలు అంటున్నారు. అసలీ  డ్రాయింగ్ కమ్ డైనింగ్ రూం కల్చర్ మనం ఎప్పుడు ఎక్కడ నేర్చుకున్నామో తెలీదు. ఇంటికి ఎవరైనా వస్తే వాళ్లు  వెళ్లేవరకు భోజనం బంద్. కర్టెను ఉన్నాలేనట్టే.

ఏ గదిలోనూ దీపం పెట్టడానిక్కూడా గూడు ఉండదు. అద్దెకిచ్చి నన్నాళ్లు ఏ షెల్ఫ్ కట్టించరు. కట్టిస్తే అద్దె అదనం. వంటిల్లు వన్ వే. చాలా మంది కక్కుర్తి కొద్దీ బాల్కనీలు కట్టరు.  మరింక అంట్లు తోవడం, బట్టలుతకడం అన్నీ  బాత్రూంలోనే. రెండు బాత్రూంలు ఉంటే కొంత నయం. పిల్లలు స్కూలుకి వెళ్లే వేళ, మొగాళ్లు ఆఫీసుకి వెళ్లేవేళ, పని మనిషి వచ్చే వేళ ఒకటే. రోజూ యుద్ధాలే.

నీళ్లున్నప్పుడు పనిమనిషి రాదు.

అది వచ్చినప్పుడు నీళ్లు రావు.

ఆలీబాబా నలభై దొంగల కథలోలాగా నిలువెత్తు డ్రమ్ములుకొని నీళ్లు నిలవ చేద్దామంటే, ఆ డ్రమ్ములు  బాల్కనీలో పెడితే తలుపు వెయ్యబడదు. బాత్రూంలో పెడితే తలుపు తియ్యబడదు.

బట్టలెక్కడ ఆరేస్తాం?

బెడ్‌రూంలోనే తాళ్లు కట్టి ఫేన్ వేస్తారుట.

మనుష్యులకే ఎండ తగలడం లేదు.

కొన్నేళ్లు ఫ్లాట్స్‌లో ఉంటే ఎంచక్కా తెల్లగా పాలిపోతాం మరి.

'తులసి మొక్క కూడా లేకపోతే ఎలాగే?' అని అమ్మ గోల.

చంటి పిల్లలు ఉయ్యాల, జోలపాట మరిచే పోయేరు పాపం.

ఇంతకీ ఈ తరం తల్లులకి జోలపాటలేం వచ్చు - వాళ్ల మొహం.

ఏవిటో! నా లాంటి చాదస్తం వాళ్లు ఇన్ని ఎంచుతున్నారు కాని ఏ ఫ్లాట్ ఖాళీ ఉండటం లేదు.

ఎక్కడో తలదాచుకోవాలి కదా!

ఇల్లు దొరకడం కంటె పెద్ద ప్రాబ్లమ్ మా సామాను. నేను పుట్టకముందు కొన్న సామాన్లు కూడా ఇంకా మోస్తున్నాం.

నేను పుట్టినప్పుడు చేయించిన ఉయ్యాల మా మనవలు కూడా ఊగేరు.

సరే, మా అమ్మమ్మ నాటి రుబ్బురోలూ, తిరగలి మొదలు ఈనాటి గ్రైండరు వరకు ఉన్నాయి.

ఏదీ పారెయ్యడానికి ప్రాణం ఒప్పదు.

ఎవరికైనా ఇవ్వడానికి మనసొప్పదు.

అదీ మన మిడిల్ క్లాస్ మెంటాలిటీ.

నవాబుగారి హవేలీ కూడా చాలదు మా సామానుకి. ఈ సారైనా కొంత పారెయ్యాలి. పారెయ్యడానికే నిశ్చయించుకున్నాను.

ముందు ఇంటి పెద్ద మావారి దగ్గర ప్రారంభించేను. ఆయన జడ్జి చేసి రిటైరయ్యేరు. అయినా ఎప్పాయింట్‌మెంట్ ఆర్డరు ఇంకా దాచారు. అప్పుచేసి కారుకొనడం, ఆ అప్పు తీరిపోవడం, ఆ కారుకి కాళ్లు రావడం అన్నీ అయిపోయేయి. కాని లోన్ కాయితాలు ఇంకా ఉన్నాయి.

అంతేకాదు. పూర్వాశ్రమంలో ఆయన పెయింటింగ్ చేసేవారు. ఏ మాటకామాటే చెప్పుకోవాలి పాపం బాగా వేశేవారు. ఈ మధ్య ఫ్రెండ్సు, వ్యాపకాలు ఎక్కువై మానేశేరు. పిల్ల చచ్చినా పురిటి వాసన పోనట్టు పెయింటింగ్ మానేసినా గదిలో ఎక్కడ చూసినా బ్రష్‌లు, డ్రాయింగ్ కాయితాలు, ఆయిల్ కలర్స్, వాటర్ కలర్స్, పెన్సిళ్లు ఒకటేమిటి నా నా గోత్రస్య ఉంటాయి. ఆ రంగులన్నీ రాళ్లు

అయిపోయాయి. అయినా ఎవరం ముట్టుకోం.

ట్రాన్స్‌ఫరైనప్పుడల్లా నేను "ఇవి కొంచెం సార్ట్ చెయ్యి..." అనబోవడం "చూడు ఐయామ్ వెరీ బిజీ. చావడానికి క్కూడా టైములేదు. అవన్నీ కట్టకట్టి పట్టుకుపో. అయినా నువ్వేమైనా నెత్తిమీద పెట్టుకుని మోస్తున్నావా? లారీలో పడెయ్యడానికి అంత ఆయాసమెందుకూ?" అని ఆయన విసుక్కోవడం రివాజు.

కాని ఇప్పుడింక నావల్ల కాదు.

మెల్లిగా వచ్చి "ఇప్పుడైనా అవన్నీ..." అడగబోయేను సగం భయపడుతూనే.

అప్పుడతను పైపులో టొబాకో కూరుతున్నారు. ఐ.ఎ.యస్ అకాడమీలో ఉద్యోగం ఆయనకి పైపు అలవాటు చేసింది. పైపులో టొబాకో కూరడం తాత్కాలికంగా వాయిదావేసి మర్డరు కేసులో ముద్దాయిని చూసినట్టు చూశారు 'ఫర్ గాడ్స్ సేక్ నన్నొదిలీ. తేరగా నేనే దొరుకుతాను నీకు. ఇన్నేళ్లు ఎలా మోసేవో అలాగే మొయ్యి. మరేం ఫరవాలేదు' అని మళ్లీ పైపు సేవలో పడిపోయేరు.

భగవాన్! ఈయనతో నేనిన్ని ఏళ్లు కాపరం ఎలా చేశానో? ఎలా ఏవిటి? ఇలాగే. అన్నిటికీ గంగిరెద్దులా బుర్రూపడమే.

మొయ్యమన్నారు. మొయ్యడమే.

అలనాడు సుమతి మొగుడ్ని నెత్తి మీద పెట్టుకుని మొయ్యగాలేనిది. నేను అఫ్టరాల్ సామాను మొయ్యకపోవడమా! మన సంస్కృతికే ఇన్నాళ్టు.

ఏ హమారా పరంపరా.

పతి దేవుడి కోనమస్కారం పెట్టి పెద్ద కొడుకు దగ్గరికి వెళ్లాను.

వీడు వాళ్ల నాన్నకి అక్షరాలా కొడుకు. రోడ్డు మీద చిన్నమేకు దొరికినా ఎందుకైనా పనికొస్తుందని దాస్తాడు.

"ఒరే అరుణా! ఎమ్.బి.ఎ. అయిపోయింది. ఉద్యోగంలో సెటిలయ్యేవు. ఇంకా ఆ బి.కాం. పుస్తకాలూ..." నా వాక్యాన్ని వాడు మధ్యలోనే ఆపేశాడు.

"అమ్మా ప్లీజ్. నా జోలికి రాకు. నీ సంగతి చూడు ముందు.

పది షాపులు పెట్టేటంత స్టీలు సామాను పోగేశావు. నన్ను, నా సామానుని వదిలెయ్" అన్నాడు.

"ఎవరి సరదాలు వాళ్లకుంటాయి కదండీ" సాగదీసింది కోడలు.

"ఆ వాక్యం నాకూ వర్తిస్తుంది" అన్లేదు నేను.

ఇవేళ రంపిడొచ్చి నాకు సూక్తులు చెప్తోంది.

నాకు ఒక్క విషయం బాగా అర్థమైంది. ఒక్క వాక్యం పూర్తిగా అనే వాక్కు లేదు నాకు.

ఇంక మిగిలింది మా అమ్మ.

ఆవిడ వయసులో ఉన్నప్పుడు తట్టలు, బుట్టలు, సంచులు తెగ అల్లేది. అంచేత పాలకవర్లు, టూత్ పేస్టు మూతలు, సీసాలు ఏది కనిపిస్తే అది దాస్తుంది. స్నో సీసాలు, టూత్ పేస్టు మూతలు నేను చెత్త బుట్టలో పారెయ్యడం, ఆవిడ గద్దలా తన్నుకుపోయి దాచెయ్యడం, ఇహ రంపిడికి చెప్పినా లాభంలేదు.

అంచేత చెత్త బుట్టలో పారెయ్యడం మానేసి, గోడవతల విసిరెయ్యడం ప్రారంభించేను.

ఆవిడ నాకు అమ్మ!

నాకంటే నాలుగాకులేం ఖర్మ నాలుగు చెట్లే ఎక్కువ చదివింది. ఏదీ పూర్తిగా ఖాళీ అవకుండానే దాచెయ్యడం ప్రారంభించింది. ఇవి చాలవన్నట్టు పత్రికల్లో వచ్చే వంటలు, ముగ్గులు అన్నీ చింపి పరుపు కింద దాస్తుంది.

'మనకొచ్చిన వంటలు చాలు, ముగ్గులు పెట్టే వయసు కాదు. ఎందుకమ్మా ఈ తాపత్రయం?' అన్నాను భయపడుతూనే.

"బావుందే తల్లీ. చాలా బావుంది. ఉరుము ఉరిమి మంగలం మీద పడిందని ఆఖరికి నా మీద పడ్డావా? ఇంతెడు సామానులో నాదే ఎక్కువైందా? అవేమైనా నీళ్లు, మేత అడిగేయా? నాకు మాత్రం సరదాలుండవా? నేనెవర్నీ బాధ పెట్టడంలేదు. నా బాధ నేను పడుతున్నాను. అయినా ఒకర్ని అనుకుని ఏం లాభం? నాది అంటూ మీ నాన్న ఓ చిన్న పాకైనా వేశారు కాదు. అయినా అప్పుడిలాంటి గడుసుతనాలు లేవు మరి" అని సెంటిమెంటుతో కొట్టింది.

ఇవికాక ఎక్కాలు పుస్తకం మొదలు ఎన్‌సైక్లోపీడియా వరకు, రామాయణం మొదలు రాబిన్ కుక్ వరకు కొన్ని వందల పుస్తకాలున్నాయి. కొన్ని పుస్తకాలు నా కంటే పెద్దవి. ఇప్పుడు దొరకవు.

'ఎప్పుడో చదివే పుస్తకాల్ని దాచడం ఎందుకూ? స్థలం వేస్ట్. ఏ లైబ్రరీకో పారెయ్యక' మా అల్లుడి వ్యాఖ్య.

అతను చదివేవి రెండే, ఒకటి – పంచాంగం; రెండు – లలితా సహస్రనామం.

నాకు బాగా కోపం వచ్చినప్పుడు మాత్రం "ఏదో మేము బతికున్నంత కాలం భరించండి. మేము చచ్చిపోయినప్పుడు చెరి సగం వేసి తగలెయ్యండి. కర్రల ఖర్చు తగ్గుతుంది" అంటాను.

ఏవిటో! వెధవ మమకారం.

మేముపోయిన మర్నాడు అవన్నీ పాత పేపర్ల వాడికి అమ్మేస్తారు. తథ్యం.

వెధవ ప్రాణం మనతో చెప్పి పోతుందా?

వెర్రి అంతే.

ఇంతకీ మాకు సరిపోయే ఇల్లు దొరికినప్పుడు మాట కదా!

'సరిపోయే ఇల్లు దొరకదు. సరిపెట్టుకుందాం' అంటారు పిల్లలు.

ఏమో! ఏం జరుగుతుందో!

చూడాలి మరి!

వాన రాకట – ప్రాణ పోకట – ఇల్లు దొరుకుట ఎవరు చెప్పగలరు.

*("ఆంధ్రప్రభ" సంక్రాంతి సంచిక 15-1-1997)*

★ ★ ★